క్లుప్తంగా

రేపు ఉపా చట్టం రద్దు కోరుతూ మహా ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ, ప్రజా వ్యతిరేకమైన ఉపా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని, ఉపా కింద అరెస్ట్ చేసిన వారందరిని బేషరతుగా విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 15న విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా చేస్తామని ఉపా రద్దు పోరాట కమిటీ కో కన్వీనర్ దుడ్డు ప్రభాకర్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో మహాధర్నా వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, విరసం నాయకులు అరసవిల్లి కృష్ణ, రివేరా, కుల నిర్మూలనా పోరాట సమితి నాయకులు టి.శ్రీరాములు, ఎ.రవిచంద్ర, రామకృష్ణ, రాజేష్, కోటేశ్వరరావు, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వివాహ ఆభరణాల ప్రదర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): పీఎంజే జ్యూవెల్స్ వివాహ ఆభరణాలు సితార కలెక్షన్స్ ప్రదర్శన గురువారం నగరంలోని హోటల్ గేట్ వేలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనను దేవినేని అనుపమ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రదర్శనలోని నెక్లెస్‌లు, చెవిపోగులు, గాజులు, ఉంగరాలు, పొల్కాలో పాటు నాణ్యమైన డైమండ్స్ అలంకరించిన ఆభరణాలు, విలువైన లోహలతో రూపొందించిన అరుదైన అభరణాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సితార కలెక్షన్స్‌ను విజయవాడలోని ఆభరణాల ప్రియుల కోసం ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పీఎంజే విజయవాడ స్టోర్‌హెడ్ మోహనకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా బిజినెస్ హెడ్ హైదర్ అలీ పాల్గొన్నారు.

హెడ్ పోస్టాఫీస్ ప్రాంగణంలో వైద్య శిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎంజేనాయుడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని హెడ్ పోస్టాఫీస్ ప్రాంగణంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సంస్థ చైర్మన్ డాక్టర్ వావిలాల రజనీ కాంతశర్మ ప్రారంభించారు. హెడ్ పోస్టాఫీస్ ప్రాంగణంలోని సీనియర్ సూపరింటెండెంట్ కార్యాలయం సిబ్బంది, పోస్టల్ సిబ్బందికి వైద్యులు నాగేశ్వరరావు, రవితేజ, వంశీకృష్ణ, జ్యోతి తదితరులు వైద్య సేవలందించారు.

హజ్ యాత్రికుల సౌకర్యాలపై హర్షం



వించిపేట(విజయవాడపశ్చిమ): హర్ దిల్ మే వైఎస్సార్ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ గురువారం సాయంత్ర 56వ డివిజన్ పాత రాజరాజేశ్వరిపేటలోని గల నూర్ ఏ ఇలాహి మసీదుకు వెళ్లి మగ్రీబ్ నమాజు అనంతరం స్థానిక ముస్లిం పెద్దలతో సమావేశమయ్యారు. హజ్ యాత్రికులను అత్యున్నత సౌకర్యాలతో విజయవాడ నుంచి పవిత్ర హజ్ యాత్రకు ప్రభుత్వం పంపించడంపై ముస్లిం పెద్దలు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గౌస్‌మోహిద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మైనార్టీ సంక్షేమ పథకాలను మైనార్టీ పెద్లకు వివరించారు. మసీదులో ఇమామ్, మౌసన్ వేతనాలు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ నాయకులు షేక్ బడేమియా, ఎండీ ఇక్బాల్, షేక్ నాగుల్ మీరా, సయ్యద్ ఇమ్రాన్, మసీదు ప్రెసిడెంట్ ఖలీల్ బేగ్, వైస్ ప్రెసిడెంట్ షబ్బీర్ అహ్మద్ బేగ్, ట్రెజరర్ షేక్ చాన్‌బాషా, షేక్ బాబు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాలో నగదు మాయంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాలోని నగదు మాయమైందని అజిత్ సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. అజిత్ సింగ్‌నగర్ పైపుల రోడ్డు ప్రాంతా నికి చెందిన ఆకురాతి శ్రీనివాసరావు భవానీపురం పైపుల దుకాణంలో పనిచేస్తున్నారు. ఆయనకు సింగ్ నగర్ పైపులరోడ్డు ఎస్‌బీఐ బ్రాంచిలో ఖాతా ఉంది. కంపెనీ పరంగా అతని ఖాతాలో రూ.80,867 నగదు ఉండాలి. గత నెల 30వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు పైపులరోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం నుంచి రూ.2 వేలు విత్‌డ్రా చేశారు. తరువాత ఈ రోజు బ్యాంకుకు వెళ్లి చూడగా అతని ఖాతాలో ఉండాల్సిన రూ.70,867 నగదు కనిపించలేదు. దీంతో బ్యాంకు బ్రాంచి సిబ్బందిని సంప్రదించినా ఎటువంటి సమాధానం లభించలేదు. గురువారం సాయంత్రం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను ఎవరికీ ఎటువంటి ఓటీపీలు చెప్పలేదని, అయినా తన ఖాతాలో నగదు మాయమైందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అసైన్డ్ భూములపై హక్కుల కల్పన చారిత్రాత్మకం

- వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి
- కృతజ్ఞతగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తరువాత మళ్లీ భూ పంపిణీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో భూమి లేని దళిత, బడుగు బలహీనవర్గాలకు చెందిన 46,935 మంది నిరుపేదలకు పంపిణీ చేసేందుకు బుధవారం కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు ఆధ్వర్యంలో గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు పంపిణీచేసిన 20 ఏళ్ల తరువాత ఆ భూమిపై సంబంధిత రైతులు, వారి వారసులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దాదాపు 22 లక్షల మంది బడుగు, బలహీనవర్గాలకు ప్రయోజనం చేకూరు తుందన్నారు. రెండు దశాబ్దాల అనంతరం వారందరికీ పట్టా భూముల రైతుల మాదిరిగానే అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలకు అవకాశం కలుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలకు మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

దశాబ్దాలుగా ఎస్సీలు ఎదురు చూస్తున్నారు

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు పొందిన ఎస్సీలు వాటిపై యాజమాన్య హక్కుల కోసం కొన్ని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారని, అది ఇప్పుడు సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో సాకారమయ్యిందని తెలిపారు. పేదల సంక్షేమానికి పాటుపడ్డ తన తండ్రి వైఎస్సార్ కంటే రెండడుగులు ముందుకేస్తానన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్న మాటను నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయమే నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు చందా కిరణ్, బూదాల శ్రీను, మధిర ప్రభాకర్, నత్త యోన రాజు, యర్రజొన్న విజయలక్ష్మి, తాండ్ర ఇంద్ర, కామళ్ల జోజి, నాగెళ్ల సంగీత్ బాబు, చేపూరి శ్రీను, వి.థామస్, వై.శ్యామ్, సుబ్బారావు, కట్టా సత్తెయ్య, కార్పొరేటర్లు బాపతి కోటిరెడ్డి, యలకల చలపతి రావు, శిరంశెట్టి పూర్ణ, పార్టీ నాయకులు మైలవరపు దుర్గారావు, వెన్నం రజని, పణుకు ఫణి, శేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వెలంపల్లి, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి, శరత్

విద్యాశాఖ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డికి సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ విద్యావిధానం 2020 అమలులో భాగంగా పాఠశాలలో జాతీయ క్రెడిట్ ఫ్రేంవర్క్ (ఎన్‌సీఆర్‌ఎఫ్) సబ్ కమిటీ సభ్యులుగా నియమితులైన రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డిని గురువారం నగరంలో ఘనంగా సత్కరించారు. లబ్బీపేటలోని ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్‌తో పాటు పలువురు ఘనంగా సత్కరించారు. దేవానందరెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఏ విధంగా ప్రణాళికాబద్ధంగా చదవాలి, సమయాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలిపారు. తాను ఈ స్థాయికి రావడానికి ఎలా కృషి చేశారో చెప్పారు. కార్యక్రమంలో ఆ సెంటర్ అధ్యాపకులు ఓలేటి నాగార్జున, పిన్నింటి బాలకృష్ణ, రాంబాబు, ధరణి శ్రీనివాస్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

సీఎంపై విమర్శలు చేస్తే సహించేది లేదు

పవన్ వ్యాఖ్యలను ఖండించిన ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన విమర్శలను రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కె.బసవరావు తీవ్రంగా ఖండించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రికి పోలీసులు, పోలీసు వ్యవస్థపైన అపార గౌరవం ఉందన్నారు. పోలీసు శాఖలో దిగువ స్థాయి కానిస్టేబుల్, చివరికి హోంగార్డును సైతం గౌరవించే సంస్కారం ఆయనదని పేర్కొన్నారు. సీఎం వద్దకు కానిస్టేబుల్ వెళ్లినా గౌరవిస్తారన్నారు. సామాన్య కానిస్టేబుల్ అయిన తనను ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమించారని, సీఐగా పని చేస్తున్న గోరంట్ల మాధవ్‌కు ఎంపీగా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి డీజీపీ సెల్యూట్ చేయడాన్ని పవన్ కల్యాణ్ తప్పుబట్టడం సిగ్గుచేటన్నారు. పవన్ క్యారెక్టర్ ఏమిటో తనకు బాగా తెలుసునని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి ప్రజలకు వివరిస్తానని చెప్పారు. ప్రాణభయం ఉందంటున్న పవన్ కల్యాణ్ పాకిస్తాన్, చైనాతో ఏమైనా యుద్ధం చేస్తున్నాడా అంటూ ఎద్దేవా చేశారు.

వెలంపల్లిపై అసత్య ఆరోపణలను సహించం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని దుర్గగుడి పాలకమండలి సభ్యులు కట్టా సత్తెయ్య పేర్కొన్నారు. గురువారం 45వ డివిజన్ ఏకలవ్యనగర్‌లోని తన కార్యాలయంలో సత్తెయ్య విలేకరులతో మాట్లాడారు. వెలంపల్లిపై జనసేన నాయకుడు పోతిన మహేష్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రూ.20 కోట్లతో 40 ఆలయాలను అభివృద్ధి చేసిన వ్యక్తి వెలంపల్లి అని కొనియాడారు. ఈ సందర్భంగా పోతిన మహేష్ నేర చరిత్రను వివరించారు. వెలంపల్లి శ్రీనివాసరావుపై పోతిన మహేష్ చేసిన వ్యాఖ్యలను రూపా బాయమ్మ ట్రస్ట్ చైర్మన్ యర్రజొన్న విజయలక్ష్మి ఖండించారు.

ట్రైనీ జేసీలకు రిజిస్ట్రేషన్లపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో ట్రైనీ జేసీలు

గుణదల (విజయవాడ తూర్పు): ప్రభుత్వ విధి విధానాలపై అవగాహన కలిగి నిబద్ధతతో పని చేయాలని పటమట సబ్ రిజిస్ట్రార్ వేగే కృష్ణచైతన్య అన్నారు. గుణదల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ట్రైనీ జాయింట్ కలెక్టర్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ, అగ్రికల్చర్ వంటి విభాగాల్లో అవగాహన ఉండాలన్నారు. ప్రధానంగా పాలనా అంశాలపై పట్టు సాధించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలక అంశాలపై అవగాహన కల్పించారు. విక్రయ దస్తావేజు, తనఖా, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ వంటి డాక్యుమెంట్ల ఆవశ్యకతను తెలియచేశారు. ఈసీ, నకలు, బుక్ -1,బుక్-4 రిజిస్ట్రేషన్లపై ప్రాజెక్టర్ ప్రజెంటేషన్ అందించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో బస్ రిజిస్ట్రార్‌ల పాత్రను విశదీకరించారు. కక్షిదారులు క్రయ, విక్రయాలు జరుపుకునే సమయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీని వివరించారు. కార్యక్రమంలో గుణదల సబ్ రిజిస్ట్రార్ కృష్ణప్రసాద్, దాదాపు 30 మంది ట్రైనీ జాయింట్ కలెక్టర్ లు పాల్గొన్నారు.

35 మందిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్లపై వాహనాల రాకపోకలు, ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన జనసేన పార్టీకి చెందిన 35 మందిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జనసేన పార్టీకి చెందిన పోతిన మహేష్, మరో 34 మంది చిట్టినగర్ జంక్షన్‌లో రోడ్డు మధ్యలో బైఠాయించి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు. వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలిగించడంతో వీఆర్వో కంచెర్ల బాలమ్మ ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

చంద్రయాన్–3తో సాంకేతిక పురోగతి



అతిథి ఉపన్యాసం చేసిన శ్రీకుమార్‌ను సన్మానిస్తున్న లయోల కాలేజీ అధ్యాపకులు

గుణదల(విజయవాడ తూర్పు): చంద్రయాన్–3తో దేశం సాంకేతిక పురోగతిని సాధిస్తుందని ఆంధ్రా లయోల డిగ్రీ కాలేజీ భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ పేర్కొన్నారు. 'చంద్రయాన్–3 శాస్త్రీయ ప్రాముఖ్యత–అనువర్తనాలు' అంశంపై ఆంధ్రా లయోల కళాశాలలో గురువారం అతిథి ఉపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకుమార్ మాట్లాడుతూ.. అమెరికా, మాజీ సోవియట్ యూనియన్, చైనాలను అనుసరించి చంద్రుని ఉపరితలంపై విజయవంతమైన సాఫ్ట్ ల్యాండింగ్ సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించనుందన్నారు. భూమి నుంచి చంద్రుడి పైకి వ్యోమనౌక ప్రయాణం సుమారుగా ఒక నెల రోజులు పడుతుందని అంచనా వేశారని పేర్కొన్నారు. స్పేస్ క్రాఫ్ట్ ల్యాండ్ అయిన తరువాత చంద్రుడిపై ఒక రోజు వరకు పనిచేస్తుందని, ఇది భూమిపై దాదాపు 14 రోజులకు సమానమని వివరించారు. చంద్రయాన్–3 భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కి గణనీయమైన సాంకేతిక పురోగతిని ఇస్తుందన్నారు. సౌర వ్యవస్థ మూల రహస్యాలను ఆవిష్కరించడం, చంద్రుడిపై మంచు రూపంలో నీటి ఉనికిని పరిశోధించడం ఈ మిషన్ ప్రాథమిక లక్ష్యమని తెలిపారు. మానవులకు ద్వితీయ నివాసంగా చంద్రుడి సామర్థ్యాన్ని అన్వేషించడం, ఎక్సోప్లానెట్‌ల అన్వేషణను సులభతరం చేయడమూ ఈ మిషన్ లక్ష్యమని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెవరెండ్ ఎం.టి.ప్రభు, ఏపీ ఐఏపీటీ కార్యదర్శి డాక్టర్ జి.సహాయభాస్కరన్, కళాశాల అధ్యాపకులు పి.శ్రీనివాస్‌శాస్త్రి, డాక్టర్ ఎం.సి.రావు, డాక్టర్ సి.హెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అతిథి ఉపన్యాసం చేసిన శ్రీకుమార్‌ను సన్మానించారు.

గంజాయి విక్రేతలు ఇద్దరికి జైలు శిక్ష

విజయవాడ స్పోర్ట్స్: గంజాయి విక్రేతలు ఇద్దరికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వై.శ్రీనివాసరావు గురువారం తీర్పు చెప్పారు. విజయవాడ వన్‌టౌన్ ప్రాంతంలోని రమణయ్య కూల్‌డ్రింక్ షాపు వద్ద కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడిచేశారు. గంజాయి కలిగి ఉన్న కొత్తపేటకు చెందిన అవ్వా శేషు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. 2022 నవంబర్ 19వ తేదీ జరిగిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో అవ్వా శేషుకు ఆరు నెలలు జైలు శిక్ష, అజయ్‌కుమార్‌కు ఒక నెల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

గంజాయి విక్రేత అరెస్టు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని ఎస్ఎన్‌పురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని వద్ద కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. సత్యనారాయణపురం శివాలయంవీధికి చెందిన రేగుల తేజ శంకర్ (21) ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తుంటాడు. ఈ సమాచారం పోలీసులకు అందింది. ఎస్ఎన్‌పురం ఎస్ఐ దుర్గామహేష్ సిబ్బందితో వెళ్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న తేజశంకర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న బ్యాగును సోదా చేయగా గంజాయి లభ్యమైంది. దీంతో అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

21 నుంచి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఓటరు సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పశ్చిమ నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి, వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు గురువారం ఈ కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ జాబితాలను పరిశీలిస్తారని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఏదైనా తప్పులు ఉంటే సరిచేస్తారని పేర్కొన్నారు. మరణించిన వారి పేర్లను తొలగిస్తారని పేర్కొన్నారు. రెండు చోట్ల ఓటరుగా నమోదైన వారిపేర్లు తొలగించి, పేరు, ఇంటి పేరు, కుటుంబ సంబంధాలు, జెండర్, డోర్ నంబరులో తప్పులు ఉంటే సరిచేసేందుకు వెంటనే దరఖాస్తులను స్వీకరిస్తామని సూచించారు. ఓటు హక్కు లేని వారిని కొత్తగా నమోదు చేస్తామని తెలిపారు. మరణించిన వారి పేర్లు తీసివేయడం, రేషన్ లైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, ఓటరు జాబితాల సవరణల గురించి సహాయ సహకారాలు, సూచనలపై చర్చించారు. అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులులతోపాటు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జె.ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సంక్షేమమే సంఘ్ అజెండా



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): రైల్వే కార్మికుల సంక్షేమమే దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అజెండా అని సంఘ్ డివిజనల్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఎంప్లాయీస్ సంఘ్ విజయవాడ డివిజనల్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సంఘ్ కార్యాలయంలో సీ అండ్ డబ్ల్యూ హెడ్ క్వార్టర్స్ బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్ సుకుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమంచి వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. నూతన పెన్షన్ విధానం రద్దుకు తీవ్ర పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 10న ఢిల్లీలో జరిగే నిరసన ధర్నాకు కార్మికులు తరలి రావాలని కోరారు. స్థానికంగా డివిజన్‌లో కార్మికుల ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలు పరిష్కారానికి సంఘ్ కృషి చేస్తోందన్నారు. సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు రమేష్, డేగల శ్రీనివాస్, బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు మణికుమార్, అరుణ్ రాజ్ కుమార్, ఫరీద్, సుబ్రహ్మణ్యం, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వార్డు వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో వార్డు వలంటీర్లుగా సేవలు అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉండి, పదో తరగతి విద్యార్హత ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 22వ తేదీ లోపు హెచ్‌టీటీపీ://40.81.241.107/ఏపీవలంటీర్20/ఏపీవలంటీర్090420201049.వీటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్ (81859 33187) సంప్రదించాలని పేర్కొన్నారు.

తీసుకున్న ఫోన్ ఇవ్వాలని అడిగినందుకు దాడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని కోరిన వ్యక్తిపై జరిగిన దాడి ఘటనపై గురువారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. అజిత్‌సింగ్‌నగర్ పైపులరోడ్డు ప్రాంతానికి చెందిన పి.విఘ్నేశ్వరరావు వీఎంసీ మలేరియా విభాగంలో పనిచేస్తున్నారు. ఆయన బుధవారం రాత్రి తనకు తెలిసిన నవీన్‌కుమార్‌తో కలిసి పైపులరోడ్డు లోని ఓ మద్యం దుకాణంలో మద్యం తాగారు. రాత్రి 11 గంటలకు విఘ్నేశ్వరరావు ఫోన్‌ను నవీన్‌కుమార్ తీసుకుని మాట్లాడుకుంటూ వెళ్లిపోయాడు. దీంతో విఘ్నేశ్వరరావు తన స్నేహితుడు అంబటి ప్రసాద్‌ను తీసుకుని నవీన్‌కుమార్ ఇంటికి వెళ్లి ఫోన్ ఇవ్వాలని అడిగారు. తాను ఫోన్ తీసుకోలేదంటూ విఘ్నేశ్వరరావుతో నవీన్‌కుమార్ గొడవ పడ్డారు. పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణంలోని గాజు సీసాతో విఘ్నేశ్వరరావు తలపై కొట్టాడు. గాయపడిన విఘ్నేశ్వరరావు ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించుకుని గురువారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఓ లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. గత నెల 28వ తేదీన జరిగిన ఈ ప్రమాదంపై గుణదల పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పెదపులిపాకకు చెందిన పేకేటి రమేష్(58) ప్రైవేట్ ఉద్యోగి. ఆయన గతనెల 28న బీఆర్‌టీఎస్ రోడ్డు సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో రమేష్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ ప్రమాదంపై గురువారం గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు నిబంధనలు కచ్చితంగా పాటించాలి

ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసాద్



సత్యనారాయణపురం (విజయవాడసెంట్రల్): వాహన చోదకులు ట్రాఫిక్ నియమనిబంధనలు, మోటార్ వాహన చట్టాలను కచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్ సూచించారు. అప్పుడే సురక్షితంగా ప్రయాణం సాధ్యమన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాలులో త్రీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెడ్ మాస్టర్లు, వాహనాల ఇన్‌చార్జులు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఏడీసీపీ ప్రసాద్ మాట్లాడుతూ.. కాలేజీ, స్కూల్ యాజమాన్యం తరఫున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్కూల్ విద్యార్థులు ప్రయాణించే బస్సులు, స్కూల్‌కు వచ్చే ఆటోల భద్రత, ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ట్రాఫిక్ ఏసీపీ-3 శ్రీనివాసరావు, త్రీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐలు డి.వి.రమణ, ఐ.డి.ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.